సాక్షి
జనగామ
శుక్రవారం । 4 । ఆగస్టు । 2023



పసుపు.. పరుగు

పచ్చ బంగారం ధర పరుగులు పెడుతోంది. పసుపునకు రికార్డు స్థాయిలో గరిష్ట ధర క్వింటాకు రూ.12 వేలకు పైగా పలుకుతోంది.

- 8లో▸



పరిజ్ఞానం పెంపొందించుకోవాలి

విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఇస్రో మాజీ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ అపూర్వ కంజిలాల్ అన్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
$33^0/24^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం అక్కడక్కడా చిరుజల్లులు కురుస్తాయి. సాయంత్రం చల్లని గాలులు వీస్తాయి.

మద్యం రిజర్వేషన్లు ఖరారు

- కలెక్టరేట్‌లో లాటరీ ప్రక్రియ
- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ
- 21న దుకాణాల కేటాయింపునకు లాటరీ



మద్యం దుకాణాల రిజర్వేషన్ల కేటాయింపు కోసం లాటరీ తీస్తున్న కలెక్టర్ శివలింగయ్య

జనగామ: జిల్లాలో నూతన మద్యం దుకాణాల కేటాయింపుల ప్రక్రియ మొదలైంది. వైన్స్‌ల కేటాయింపు రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి కాగా.. శుక్రవారం నుంచి దరఖాస్తుల స్వీకరణకు ఎక్సైజ్ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రస్తుత దుకాణాల టెండర్ల కాల పరిమితి ఈఏడాది నవంబర్ వరకు ఉండగా.. ప్రభుత్వం మూడు నెలల ముందుగానే కొత్త వాటి కోసం టెండర్లకు అవకాశం కల్పించింది. దీంతో వైన్స్ యజమానులు కొంత మేర నిరాశకు గురవుతుండగా.. సర్కారు మాత్రం తన పని తాను చేసుకుంటూ ముందుకు వెళ్తోంది. జిల్లాలో 47 మద్యం దుకాణాలు ఉండగా, ఇందులో జనరల్ 28, గౌడ 13, ఎస్సీ కేటగిరీ 5, ఎస్టీ కేటగిరీలో లాటరీ ద్వారా 1 కేటాయించారు.

కలెక్టరేట్‌లో లాటరీ..

జిల్లాలో నూతన మద్యం దుకాణాల కేటాయింపుల్లో రిజర్వేషన్ల కోసం గురువారం కలెక్టరేట్‌లో లాటరీ నిర్వహించారు. జిల్లా ఎక్సైజ్ అధికారి కృష్ణప్రియ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ అధికారులు కొర్నేలియస్, రవీందర్‌తో కలిసి కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య మద్యం దుకాణాల రిజర్వేషన్ల కోసం లక్కీ డ్రా తీశారు. జిల్లాలో 47 మద్యం షాపులకుగాను 19 షాపులకు రిజర్వేషన్లను ఖరారు చేశారు. ఇందులో గౌడ సామాజిక వర్గానికి-13 (15 శాతం), ఎస్సీ సామాజిక వర్గానికి- 5(10 శాతం), ఎస్టీ సామాజిక వర్గానికి-1(5శాతం) మద్యం దుకాణాలను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. జనరల్‌కు-28 (70శాతం) కేటాయించారు. గౌడ కేటగిరీలో జిల్లాలోని మున్సిపల్‌తో పాటు మండలాల వారీగా మద్యం దుకాణాల వారీగా 6, 8, 12, 13, 16, 18, 29, 31, 32, 34, 36, 45, 47, ఎస్సీలకు 17, 28, 37, 42, 46, ఎస్టీలకు 20 నంబర్లు కేటాయించగా... ఏరియాలతో సహా గెజిట్లో పొందుపర్చారు.

నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

2023-25 సంవత్సరాలకు(రెండేళ్లు)గాను శుక్రవారం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కానుంది. జిల్లా కేంద్రంలోని వడ్లకొండ రోడ్డు ఇరిగేషన్ క్వార్టర్స్‌లోని డిస్ట్రిక్ ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో జనగామ, పాలకుర్తి, స్టేషన్ ఘన్‌పూర్ స్టేషన్ల వారీగా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. దరఖాస్తుదారులు రూ.2 లక్షల చలానాతో పాటు ఆధార్, పాన్‌కార్డు జిరాక్స్‌లను అప్లికేషన్‌తో జత పర్చాలి. ఒక వేళ రిజర్వేషన్ కేటగిరీలో ఉన్న వారు కుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా సమర్పించాలి. ఈనెల 4 నుంచి 18వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ, 21న కలెక్టర్ నేతృత్వంలో లాటరీ నిర్వహించి, మండలాల వారీగా మద్యం దుకాణాల కేటాయింపులు చేస్తారు. ప్రస్తుత వైన్స్ దుకాణా టెండర్ నవంబర్ 30 వరకు ఉండగా.. కొత్త వాళ్లు నవంబర్ 1 నుంచి నూతన మద్యం దుకాణాలను ఓపెన్ చేస్తారు.

జిల్లాలో మండలాల వారీగా మద్యం దుకాణాలు, రిజర్వేషన్లు

మండలం	వైన్స్‌లు	జనరల్	గౌడ	ఎస్సీ	ఎస్టీ
జనగామ మున్సిపల్	10	08	02	–	–
పెంబర్తి	01	01	–	–	–
నెల్లుట్ల	03	01	02	–	–
నర్మెట	02	01	01	–	–
బచ్చన్నపేట	03	01	01	01	–
చిల్పూరు, చిన్న పెండ్యాల	01	–	–	–	0
చిల్పూరు, కరుణాపురం	01	01	–	–	–
స్టేషన్‌ఘన్‌పూర్	04	04	–	–	–
స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి	02	02	–	–	–
స్టేషన్‌ఘన్‌పూర్, ఛాగల్	01	01	–	–	–
తరిగొప్పుల	02	–	01	01	–
రఘునాథపల్లి	03	01	02	–	–
నిడిగొండ, రఘునాథపల్లి	01	–	01	–	–
పాలకుర్తి	04	02	01	01	–
మొండ్రాయి, కొడకండ్ల	01	01	–	–	–
కొడకండ్ల	02	02	–	–	–
జఫర్‌గఢ్	03	02	–	01	–
దేవరుప్పుల	03	–	02	01	–
మొత్తం	47	28	13	05	01

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన ఎమ్మెల్యే రాజయ్య



స్టేషన్‌ఘన్‌పూర్: హైదరాబాద్‌లోని అసెంబ్లీ హాల్‌లో సీఎం చాంబర్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమేరకు ఘన్‌పూర్ ఉన్నత శ్రేణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని, ఘన్‌పూర్ మేజర్ గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా చేయాలని, ఇటీవల కురిసిన భారీ వర్షాలతో నియోజకవర్గంలో దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టుల మరమ్మతులు, పునరుద్ధరణ కోసం నిధులు మంజూరు చేయాలని సీఎం కేసీఆర్‌ను కోరారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

టీజీఓ సంఘానికి స్థలం కేటాయించాలని వినతి



జనగామ: తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్(టీజీఓ) భవన నిర్మాణానికి జిల్లా కేంద్రంలో స్థలం కేటాయించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ అమ్జద్ అలీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ సీహెచ్.శివలింగయ్యకు వినతిపత్రం అందించారు. అనంతరం ప్రధాన కార్యదర్శి కొర్నేలియస్, ఉపాధ్యక్షులు సింగం శ్రీనివాసరావు, ఇస్మాయిల్, రవీందర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. సంఘం జిల్లా ప్రధాన కార్యాలయం కోసం అనువైన స్థలం ఇవ్వాలని కోరినట్లు తెలిపారు.

డీఆర్డీఓ బదిలీ



వరంగల్: జనగామ డీఆర్డీఓగా పని చేస్తున్న జి.రాంరెడ్డి వరంగల్ జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా గురువారం బదిలీ అయ్యారు. ఆయనను వరంగల్ జెడ్పీ సీఈఓగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సుమారు ఏడాదిన్నరగా ఖాళీగా ఉన్న వరంగల్ సీఈఓ పోస్టును ప్రభుత్వం ఎట్టకేలకు భర్తీ చేసింది.

ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో ముందుండాలి

జనగామ రూరల్: ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో ముందుండాలని, చెడు అలవాట్లకు పోకుండా యువత చదువుపై మక్కువ పెంచుకోవాలని రిటైర్డ్ కల్నల్, మాజీ సైనికుల రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మాచర్ల భిక్షపతి అన్నారు. గురువారం మండలంలోని మరిగడి గ్రామ సర్పంచ్ ఇట్టబోయిన రజిత శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముదిరాజ్ కుటుంబాలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్‌లు తమ పిల్లల్ని ఉన్నతంగా చదివించి, సామాజాభివృద్ధికి పాటుపడేలా కృషి చేయాలన్నారు. అనంతరం ఆయనను గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.సదానందం, నాయకులు కె.శ్రీనివాస్, నాగరాజు, భిక్షపతి, పెద్దులు, కిష్టయ్య, నర్సయ్య, వెంకటయ్య, కృష్ణ, ఉపేందర్ ఉన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



జనగామ రూరల్: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా నుంచి 30 మంది ఎంపికైనట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో అండర్ 14, 16, 18, 20, ఆపై గల బాల బాలికలకు పోటీలు నిర్వహించారు. 100, 400 మీటర్ల పరుగు పందెం, జావెలిన్ త్రోలో ఎంపికలు జరిగినట్లు, 7న హనుమకొండలోని నెహ్రూ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులు ప్రతిభ కనబర్చి జిల్లాకు మంచి గుర్తింపు తేవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గంగిశెట్టి ప్రమోద్‌కుమార్, కోశాధికారి అశోక్, హన్మంతారావు, శ్రీనివాస్, రంజిత్, రవీంద్రప్రసాద్, శ్రీదేవి, వినోద్, రాజు, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

'నులి' నివారణకు పరిశుభ్రత పాటించాలి

- కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య
- 93.5 శాతం లక్ష్యం పూర్తి



ఆల్బెండజోల్ మాత్ర ఇస్తున్న కలెక్టర్

జనగామ: నులి పురుగుల నివారణకు వ్యక్తిగత పరిశుభ్రత ఒక్కటే పరిష్కారమని కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని ధర్మకంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలెక్టర్ నులి పురుగుల నివారణ మందుల పంపిణీని ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 1,13,142 మంది పిల్లలు టార్గెట్ కాగా.. 1,5,787 మందికి మాత్రలు వేసినట్లు, 93.5శాతం లక్ష్యం చేరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రశాంత్, జిల్లా వ్యాధి నిరోధక టీకా అధికారి డాక్టర్ భాస్కర్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రవీందర్‌గౌడ్, డాక్టర్ శ్రీతేజ, జైపాల్‌రెడ్డి, రెహమాన్, ప్రభాకర్ తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న డీఈఓ

బచ్చన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి రామ్ అన్నారు. మండలంలోని ఇటుకాలపల్లి ప్రభుత్వ పాఠశాలలో దాతల సహాయంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను గురువారం డీఈఓ ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి గౌసియా, సెక్టోరియల్ అధికారి తోటరాజు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు దడల కనకయ్యగౌడ్, హెచ్‌ఎం జనార్దన్ ఉన్నారు.

వంద పడకలుగా ఘన్‌పూర్ సీహెచ్‌సీ అప్‌గ్రేడ్

- గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ప్రభుత్వం
- తమ నేత కృషే అంటూ కడియం, రాజయ్య అనుచరుల ప్రచారం



స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ ప్రభుత్వాస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈమేరకు గురువారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 30 పడకల సీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేయడంపై రాజకీయ ప్రత్యర్థులైన స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి కృషితోనే సాధ్యమైందని ఆయా నేతల అనుచరులు ఎవరికి వారే సోషల్‌మీడియాలో ప్రచారం చేసుకుంటున్నారు.

యూనిట్ నెలకొల్పాలి

జనగామ రూరల్: బీసీ బంధులో రూ.లక్ష ఆర్థిక సాయాన్ని తీసుకునే అభ్యర్థులు తప్పనిసరిగా యూనిట్ నెలకొల్పాలని జిల్లా బీసీ సంక్షేమాధికారి బి.రవీందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనిట్ కొనుగోలు చేసిన రసీదులు తప్పనిసరిగా లబ్ధిదారుడి వద్ద ఉండాలన్నారు. ప్రతి నెలా ప్రభుత్వ అధికారులు తనిఖీ చేస్తారని రసీదు యూనిట్ లేకపోతే రికవరీ చట్టం ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు.

దేశం చూపు తెలంగాణ వైపు

- ఎమ్మెల్యే ముత్తిరెడ్డి
- సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి పుష్పాభిషేకం



కేసీఆర్ ఫ్లెక్సీకి పుష్పాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే

జనగామ: దేశమంతా తెలంగాణ వైపు చూస్తోందని, సీఎం కేసీఆర్ హయాంలో తెలంగాణలో ఎంతో అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. సీఎం రైతులకు రుణమాఫీ చేయడాన్ని స్వాగతిస్తూ.. గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ చౌరస్తాలో కేసీఆర్ ఫ్లెక్సీకి పుష్పాభిషేకం చేయగా.. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు దూడునూరి సతీశ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున లింగయ్య, రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి, ఎంపీపీ మేకల కలింగరాజు, పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు మసిఉర్ రెహమాన్, పసుల ఏబేలు, కౌన్సిలర్లు కర్రె శ్రీనివాస్, జూకంటి లక్ష్మీశ్రీశైలం, అనిత, పేర్ని స్వరూప, బండ పద్మ యాదగిరిరెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు బూరెడ్డి ప్రమోద్‌రెడ్డి, మామిడాల రాజు, ఉల్లెంగుల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి పెద్దపీట

బచ్చన్నపేట: వ్యవసాయ రంగానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని రైతుబంధు సమితి జిల్లా కో-ఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి అన్నారు. పంట రుణాన్ని మాఫీ చేస్తున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ.. గురువారం మండల కేంద్రంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బోడిగం చంద్రారెడ్డి, పులిగిల్ల పూర్ణచందర్, దూడల కనకయ్య గౌడ్, వడ్డెపల్లి మల్లారెడ్డి, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

గౌడన్నల జీవితాలకు భద్రత కల్పించాలి

- కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య



సర్వాయి పాపన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కల్లు గీత కార్మికులు

తరిగొప్పుల: కల్లు గీత కార్మికులకు ప్రభుత్వం భద్రత కల్పించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కుర్ర ఉప్పలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సర్దార్ సర్వాయి పాపన్న 373వ జయంతిని పురస్కరించుకొని కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన 'అమరుల యాదిలో సామాజిక చైతన్య యాత్ర' గురువారం మండలానికి చేరుకుంది. ఈసందర్భంగా మండలంలోని పోతారంలో సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటానికి సంఘం జిల్లా అధ్యక్షుడు కుర్ర ఉప్పలయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్నే వెంకట మల్లయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జొన్నగోని శ్రీనివాస్, తాళ్లపల్లి పోశయ్య, జొన్నగోని సుదర్శన్‌గౌడ్, జొన్నగోని కిష్టయ్య, వంగ బీమయ్య, బైరగోని రాజు, బొమ్మెన పరుశరాములు, బొమ్మెన రాములు, శ్రీను, మూరగోని యాదగిరి, ప్రమోద్, నరహరి, కనకయ్య, మహేందర్, చంద్రమౌళి, సిద్ధయ్య, కిష్టయ్య, మొగ్గయ్య, వెంకటేశ్, లింగయ్య, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

గౌడలకు బీసీ బంధు అమలు చేయాలి

నర్మెట: ప్రభుత్వం గౌడ కులస్తులకు బీసీ బంధు అమలు చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు కొర్ర ఉప్పలయ్య, జనరల్ సెక్రటరి బాల్నె వెంకటమల్లు అన్నారు. సామాజిక చైతన్య యాత్రలో భాగంగా మండల అధ్యక్షుడు గోపగోని యాదగిరి ఆధ్వర్యంలో నర్మెట చౌరస్తాలో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో గోపగోని సుదర్శన్, స్వామి, శ్రీధర్, ప్రభాకర్, శ్రీనివాస్, ముకుందం, గొల్లపల్లి మురళి, యాదగిరి, కరుణాకర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

శిశువులకు తల్లి పాలే శ్రేయస్కరం

- జిల్లా సంక్షేమాధికారి జయంతి



మాట్లాడుతున్న జిల్లా సంక్షేమాధికారి జయంతి

జనగామ రూరల్: నవజాత శిశువులకు తల్లి పాలే శ్రేయస్కరం అని జిల్లా సంక్షేమాధికారి జయంతి అన్నారు. గురువారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని సత్రం కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, చిన్నారులు, తల్లులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా జయంతి మాట్లాడుతూ.. బిడ్డ పుట్టిన గంటలోపే పాలివ్వాలని, అమ్మపాలు అమృతంలాంటివన్నారు. నవజాత శిశువు ఆరోగ్యంగా పెరగడానికి తల్లిపాలు దోహద పడతాయన్నారు. అపోహలు వీడి తప్పకుండా తల్లిపాలు తాగించాలని, బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పూర్ణిమ, టీచర్లు స్వర్ణలత, అనిత, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

అక్రమాల పుట్ట!

- పురపాలిక ఆడిట్.. మూడేళ్ల లెక్కలు పూర్తి
- కలెక్టర్‌కు నివేదిక
- కౌన్సిల్‌లో చర్చకు అవకాశం
- నోటీసుల జారీకి రంగం సిద్ధం
- నిధుల ఖర్చుపై 'సాక్షి' వరుస కథనాలు

జనగామ: పురపాలక నిధుల ఖర్చుపై ఆడిట్‌లో అధికారుల నిర్లక్ష్యం బయటపడింది. వరుసగా మూడేళ్లపాటు ఆడిట్ లేకుండా ఇష్టారాజ్యంగా ప్రజాధనం ఖర్చు చేశారు. అధికారులు జవాబుదారీతనాన్ని మరిచారు. నాసిరకం పనులు.. అదనపు చెల్లింపులు ఇలా నిబంధనల్ని గాలికి వదిలేశారు. ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన సొమ్మును వృథా చేశారు. పట్టణాభివృద్ధిని మరిచి.. కాంట్రాక్టర్లు, స్వలాభం మాత్రమే చూసుకుంటూ.. లెక్కాపత్రం లేకుండా చేశారు. ఆడిట్, నాణ్యత లేని పనులపై 'సాక్షి' వరుస కథనాలతో ప్రస్తుత అధికారులు స్పందించారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆడిట్‌ను పూర్తి చేయించారు. ఆడిట్ అధికారులకే విస్మయం కలిగించిన అంశాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

అభివృద్ధి.. అవినీతి!

జనగామ పురపాలిక అభివృద్ధిలో ఎంతగా దూసుకుపోతుందో.. అవినీతిలోనూ అంతే అపవాదు మూటగట్టుకుంటోంది. పాలకవర్గ అసమర్థత.. అధికారులకు వరంగా మారింది. కౌన్సిల్ సమావేశాల్లో కొంతమంది సభ్యులు గర్జించినా.. అక్కడి వరకే పరిమితమవుతోంది. పనుల నాణ్యత, నిధుల చెల్లింపులు.. ఎంబీ రికార్డుల్లో తప్పులు.. ఇలా ప్రతీ విషయాన్ని కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చినా.. వారి మాటకు విలువ లేకుండా పోతోంది. ప్రతీ ఏటా లెక్కలకు ఆడిట్ చేయించి.. ఖర్చు, మిగులుబాటు లేదా ఎక్సెస్ చూపించాల్సి ఉంటుంది. ఇలా.. మూడేళ్ల ఆడిట్ లేకుండా ఇష్టం వచ్చినట్లుగా నిధులు ఖర్చు చేశారు. ప్రస్తుతం విధుల్లో ఉన్న కమిషనర్‌తో పాటు అకౌంటెంట్ నాటి ఆడిట్ లెక్కల పెండింగ్‌తో ప్రస్తుత బిల్లులకు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరగడంతో గందరగోళ పరిస్థితి నెలకొనడంతో.. మూడేళ్ల ఆడిట్‌కు కౌన్సిల్ ముందుకు వచ్చింది.

మూడు నెలలు ఆడిటింగ్

జనగామ పురపాలికలో 2019-20 నుంచి 2021-22 వరకు మూడేళ్ల ఆడిట్‌కు ఈ ఏడాది మోక్షం కలిగింది. దుమ్ము పట్టిన ఫైల్స్‌ను బయటకు తీసేందుకు నెల పట్టింది. ఇందులో ఫైల్స్, ఎంబీ రికార్డులు, ఇతర పేపర్లు దొరక్కపోవడంతో అధికారులు తలలు పట్టుకున్నారు. బదిలీపై వెళ్లిన కమిషనర్లు, డీఈ, ఏఈ, అకౌంటెంట్లు సైతం ఇక్కడికి వచ్చి కనిపించకుండా పోయిన రికార్డులు.. సంతకాలు లేని చోట చక్కబెట్టే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో 'సాక్షి' ప్రత్యేక నిఘా వేసి.. అధికారుల తీరుపై ప్రత్యేక కథనాలు ప్రచురించింది. దీంతో ఆడిట్‌ను మరింత స్ట్రిక్ట్ చేశారు. పలు ఎంబీ రికార్డులు, ఫైల్స్ లేకుండానే ఆడిట్ మొదలు పెట్టి, మూడు నెలల్లో పూర్తి చేశారు.



జనగామ పురపాలిక కార్యాలయం


వెలుగు చూసిన అక్రమాలు

ఆడిట్‌లో అనేక అక్రమాలు వెలుగు చూశాయి. ట్యాక్స్, నాన్‌ట్యాక్స్‌కు సంబంధించిన నిధుల ఖర్చుపై ఆడిట్‌లో నిజానిజాల్ని నిగ్గు తేల్చారు. 2019-20లో 3.72 కోట్ల నిధులకు సంబంధించి లెక్కలు చేశారు. ఇందులో రూ.కోటి నిధులకు సంబంధించి 27 నామినేషన్ పనులు (ఎమర్జెన్సీ సమయంలో) ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. అత్యవసర పనులు లేకున్నా.. ఇంతపెద్ద మొత్తంలో ఎందుకు చేశారని ఆడిట్ బృందం ప్రశ్నించింది. అలాగే ఒకే టెండర్‌తో 14 పనులపై బృందం అభ్యంతరం తెలిపింది. ఎస్టిమేషన్ సాంక్షన్, వర్క్ ఆర్డర్, డీఈ, కమిషనర్ సంతకాలు లేకుండా రూ.కోటి 14 లక్షల 48వేలకు సంబంధించి 35 పనులు చేయగా.. ఆడిట్ నివేదికలో బట్టబయలైంది. ఎంబీ లేకుండా 28 పనులకు సంబంధించి రూ.95 లక్షల నిధులకు రికార్డు చేసినట్లుగా తేలింది. 45 ఫైల్స్‌లో పొందుపర్చిన వివరాలకంటే అదనంగా రూ.65 లక్షల చెల్లింపులపై ఆడిట్ బృందం వివరణ కోరింది. 42 ఫైల్స్‌కు సంబంధించి రూ.30 లక్షల మేర చెక్ మెజర్‌మెంట్ లేకుండా బిల్లు డ్రాపై అడిగారు. 2020-21 ఏడాదికి సంబంధించి రూ.4.57 కోట్ల నిధులకు ఆడిటింగ్ చేశారు. ఇందులో రూ.23 లక్షల మేర ఎక్సెస్‌పేమెంట్, చెక్ మెజర్‌మెంట్ లేకుండా రూ.1.64 లక్షలు, సరైన రికార్డులు లేకుండా రూ.8,38,939 నిధులు చెల్లించినట్లు గుర్తించారు. కాగా.. క్యాష్‌బుక్ మెయింటెనెన్స్ లేకపోవడాన్ని ఆడిట్లో చూపించారు. 2021-22 ఏడాదిలో రూ.2.52కోట్ల నిధులపై ఆడిట్ నిర్వహించారు. 22 నామినేషన్ పనుల (సీసీరోడ్లు, ప్లాంట్స్, డ్రెయిన్, జేసీబీ పనులు)కు సంబంధించి రూ.60 లక్షలు ఖర్చు చేయాల్సిన అవసరం ఏముందని ఆడిట్ అధికారులు ప్రశ్నించారు. రూ.20 లక్షలకు సంబంధించి 4 పనుల (సీసీరోడ్లు, బర్నింగ్ ప్లాంటు, వాటర్ సిస్టం)కు కేవలం సింగిల్ టెండర్లు మాత్రమే వచ్చాయని, దీనిపై వివరణ ఇవ్వాల్సిందిగా కోరారు. ఎస్టిమేషన్, కౌన్సిల్ తీర్మానం, వర్క్ ఆర్డర్, డీఈ, కమిషనర్ సంతకాలు లేని 2 ఫైల్స్‌కు సంబంధించి రూ.5.52 లక్షల నిధుల్లో పూర్తి సమాచారం కోరారు. 14 ఫైల్స్ రికార్డు మేరకు రూ.27.99 లక్షల ఎక్సెస్ పేమెంట్ జరిగిందని, దీనికి జవాబు చెప్పాలని నాటి అధికారులు సమాధానం చెప్పాలని ఆడిట్ బృందం అడిగింది. చెక్‌మెజర్‌మెంట్ లేకుండా 7 ఫైళ్లపై రూ.6.91లక్షల నిధుల డ్రాపై అభ్యంతరం వ్యక్తం చేశారు. కాగా.. పట్టణ ప్రగతి, 15, 14వ ఆర్థిక సంఘం, తదితర కేటగిరీల పరిధిలోని నిధుల ఖర్చుపై నిజానిజాలు తేలాల్సి ఉంది.

నోటీసులకు రంగం సిద్ధం

ఆడిట్‌లో వెలుగు చూసిన అక్రమాలపై నాటి అధికారులు, పలువురు ఉద్యోగులు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించి వారికి నోటీసులు ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది. ఇందులో నుంచి బయటపడేందుకు అప్పటి అధికారులు పెద్ద ఎత్తున పైరవీలు సాగిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. దీనిపై త్వరలో జరగనున్న కౌన్సిల్ సమావేశంలోనూ చర్చ జరగనుంది.

ఆడిట్ పూర్తయ్యింది..



జనగామ మున్సిపల్‌లో మూడేళ్ల ఆడిట్ పూర్తయింది. నివేదికలను ఉన్నతాధికారులకు పంపిస్తాం. వారి సూచనల మేరకు ముందుకు వెళ్తాం.

- రజిత, కమిషనర్, జనగామ

ఓపెన్ డిగ్రీలో ప్రవేశాలకు గడువు

జనగామ రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఈనెల 16వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ఏబీవీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నరసయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఏబీవీ కళాశాలలో యూజీసీ కోర్సులైన బీఏ, బీకాం, బీఎస్సీ అందుబాటులో ఉన్నట్లు ఆసక్తి ఉన్న విద్యార్థులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 73829 29687 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేటి 'చలో పాలకుర్తి'ని జయప్రదం చేయండి

- జీపీకేఎస్ జేఏసీ జిల్లా చైర్మన్ రాపర్తి రాజు



జీపీ కార్మికుల దీక్షలో పాల్గొన్న రాపర్తి రాజు

దేవరుప్పుల: విస్నూరు దేశ్‌ముఖ్‌ల ఆగడాలను అంతమొందించిన పాలకుర్తి గడ్డలో జీపీ కార్మికుల సమస్యల సాధన కోసం ఉద్యమ ఉధృతికి నాంది పలికేందుకు శుక్రవారం పాలకుర్తిలో నిర్వహించనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని గ్రామ పంచాయతీ కార్మిక సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ రాపర్తి రాజు పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద కొనసాగుతున్న జీపీ కార్మికుల రిలే నిరాహార దీక్ష శిబిరం వద్ద గురువారం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జీపీయూకేఎస్ జిల్లా, మండల అధ్యక్షులు బత్తిని వెంకన్న, బస్వ రామచంద్రు, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ పైండ్ల వెంకటరమణ, వెంకట్‌రెడ్డి, కరుణాకర్ తదితరులున్నారు.

రుణమాఫీ.. అన్నదాత హ్యాపీ

- వరంగల్ డీసీసీబీలో మొత్తం రుణమాఫీ రూ.283.97 కోట్లు
- మొదటి విడతలో రూ.6.49 కోట్లు
- రెండో విడతలో రూ.16.50 కోట్లు..

హన్మకొండ : రాష్ట్ర ప్రభుత్వం 2018లో ప్రకటించిన రుణమాఫీ పథకం కింద వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)కి పరిధిలోని 70 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా మొత్తం 66,400 మంది రైతులు రూ.283.97 కోట్ల మేర రుణమాఫీ ద్వారా లబ్ధి పొందుతున్నారు. అయితే ప్రభుత్వం ఇప్పటి వరకు రెండు విడతల్లో రుణమాఫీ చేసింది. మొదటి విడతలో రూ.25 వేల లోపు రుణమాఫీ చేసింది. రెండు విడతలో రూ.50 వేల లోపు రుణాలు మాఫీ చేసింది. ఆ తర్వాత రుణమాఫీ నిలిచిపోయింది. ప్రస్తుతం ఎన్నికలు సమీపించిన తరుణంలో ప్రభుత్వం రూ.లక్షలోపు రుణమాఫీ చేయాలని, ఈ నెల 3 నుంచి సెప్టెంబర్ 17లోపు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఇన్ని రోజులు రుణమాఫీ అవుతుందో లేదోననే నిరాశ ఉన్న రైతుల్లో ఒక్కసారిగా సంతోషం నెలకొంది. వరంగల్ డీసీసీబీలో ఇప్పటి వరకు రూ.25 వేలలోపు రుణాలు మొదటి విడత కింద 11,430 మంది రైతులకు రూ 6.49 కోట్ల రుణమాఫీ జరిగింది. రూ.50 వేలలోపు రుణాలు రెండో విడత కింద 4462 మంది రైతులు రూ.16.50 కోట్లు లబ్ధి పొందారు. ఇప్పటివరకు రెండు విడతలలో కలిపి 15892 మంది రైతులకు రూ.23.01 కోట్లు రుణమాఫీ జరిగింది. డీసీసీబీ ప్రభుత్వానికి సమర్పించిన రుణ మాఫీ మొత్తంలో రెండు విడతలలో విడుదలైన రుణమాఫీ పోను ఇంకా 27542 మంది రైతులకుగాను రూ.220.96 కోట్లు రుణమాఫీ జరుగాల్సి ఉంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వీరంత రుణ విముక్తులు కానున్నారు.

నేటినుంచి సాహిత్యోత్సవాలు..

- నాలుగు రోజుల పాటు నిర్వహణ
- పలు గ్రంథాల ఆవిష్కరణ, సాహితీవేత్తల ప్రసంగాలు

హన్మకొండ కల్చరల్ : వరంగల్ సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి 7వ తేదీ వరకు సాహిత్యోత్సవాలు నిర్వహిస్తున్నామని సహృదయ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు గన్నమరాజు గిరిజామనోహరబాబు, కుందావజ్జుల కృష్ణమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ వడ్డేపల్లిరోడ్ మండల కార్యాలయం పక్కన ఉన్న పీఆర్ రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో రోజూ సాయంత్రం 6గంటలకు కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. నాలుగు రోజుల పాటు జరిగే కార్యక్రమాలలో భాగంగా మొదటిరోజు హైదరాబాద్ తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి ముఖ్యఅతిథిగా, విశిష్ట అతిథులుగా పరిషత్ కార్యదర్శి డాక్టర్ జుర్రు చెన్నయ్య , ప్రముఖ వైద్యుడు సురవరం కృష్ణవర్ధన్ పాల్గొని దివంగత సురవరం ప్రతాపరెడ్డి రచించిన హైందవ ధర్మవీరులు గ్రంథావిష్కరణ చేస్తారు. 5న శనివారం రిటైర్డ్ దేవాదాయధర్మాదాయ శాఖ కమిషనర్ నందివెలుగు ముక్తేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై దివంగత రాళ్లబండి కవితాప్రసాద్ స్మారకంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ఐజీపీ, రచయిత రావులపాటి సీతారామరావుకు సహృదయానుబంధ పురస్కారం అందజేయనున్నారు. 6న దివంగత ధరిపల్లి వెంకట నరసింహాచార్య రచించిన పురాణవైర గ్రంథామాల – జ్ఞాన విజ్ఞానం గ్రంథావిష్కరణ జరుగనుంది. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆచార్యుడు సాగి కమలాకర శర్మ ముఖ్యఅతిథిగా, కరీంనగర్‌కు చెందిన అష్టావధాని డాక్టర్ గంద్ర లక్ష్మణరావు, ధరిపల్లి రఘురామ్ విశిష్ట అతిథులుగా పాల్గొంటారు. చివరి రోజు 7న కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్ ముఖ్యఅతిథిగా, సాహితీవేత్త గంటా రామిరెడ్డి, మాధవి, రాధిక విశిష్టఅతిథులుగా హాజరై దివంగత వే. నరసింహారెడ్డి రచించిన సవిత కవిత సంకలనం ఆవిష్కరణ చేయనున్నారు. ఈ సందర్భంగా వైభవంగా జరిగే సాహిత్యోత్సవాలలో కవులు, రచయితలు, నగర ప్రజలు , సాహిత్యఅభిమానులు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

రెడ్డి చికెన్ సెంటర్
Cell: 9989299661

JANGAON COLLEGE OF EDUCATION
Nidigonda (Vill.), Raghunathpalli (Mdl.) Jangaon (Dist.) - 506244
Ph: 8309749584, 9131530066
WANTED FACULTY
Applications are invited from the eligible candidates with Bio-data, Photostat copies of Certificates and latest passport size Photograph for the post of LECTURER IN SOCIAL SCIENCE PEDAGOGY. Applications should reach the office on or before 15-08-2023.
Qualification as per the NCTE norms. M.A (Arts. Political Science / History / Economics / Public - Adm/ Socialogy) & M.Ed with minimum in 55% and Net/SET are Qualified.
Sd/- Secretary cum Correspondent

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

మామునూర్‌లోని ఎత్తైన జాగాలో South / East కార్నర్ 390 చ॥గజాల్లో 1560 Sft నిర్మిత ఇంటికై సంప్రదించండి: సెల్: 9032111600. [W-785635]

SERVICES

హౌస్, ఫ్లాట్, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ వారికి ఆర్థిక సహాయం చేయబడును. 8096520976, హన్మకొండ. [WA-7230]

మీ బంగారం తాకట్టులో ఉందా! వడ్డీ చెల్లించలేకపోతున్నారా! తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 7013501541 [H-788613]

అతితక్కువ వడ్డీతో ఇల్లు, వ్యక్తిగత టేక్ ఓవర్, మార్టిగేజ్ లోన్స్ కలవు. CIBIL స్కోర్ తక్కువ ఉన్నా ఫైనాన్స్ ఇవ్వబడును. ఏజెంట్లు కావలెను. ఫోన్ : 9041115088 [HA-29901]

BUSINESS OFFER

RUTHUPARA PRAWNS. 50 Franchises in Telangana - 2.5 L. 50Kg's vacuum packed prawns / day. Rs.600 / pack (peeled, cleaned, ready-to-cook). Rs.60 Margin/pack. Contact: 8328099433. [WB-19489]

OLD AGE HOME

త్రివేణి హోంకేర్: వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకోవడానికి, వంట, ఇంటి పనికి వర్కర్స్‌ను మీ ఇంటికే పంపబడును. ఫోన్: 9160900023, 9160900024. [H-189316]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9010144453
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

WANTED

శ్రీ సంతోష్ సోనాలిక షోరూం మహబూబాబాద్, తొర్రూరు బ్రాంచిలో పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం, ఇన్సెంటివ్స్, TA + DA ఇవ్వబడును. సెల్: 7702403972. [W-785636]

హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. జీతం: 13000–16000. సంప్ర॥ 9703637320. [W-189117]

ఓల్డ్ రికార్డ్ చూసి న్యూ రికార్డ్ రాయుటకు స్త్రీ/పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. ప్రతిరోజు ఆదాయం. వివరాలకు సంప్ర: 7036253618. [W-189120]

మీ మొబైల్ ద్వారా మా కంపెనీ అడ్వర్టైజ్‌మెంట్ పంపుతూ వారం వారం అధిక ఆదాయం పొందండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221504]

ప్రముఖ సంస్థకు మాయొక్క మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. సెల్: 88854 86421. [M-1221475]

WANTED TEACHERS

To Teach Maths, Telugu Primary, Telugu & Phy.Science, Bio Higher Classes. VISHWATEJA HIGH SCHOOL, Gopalpur Road, Hanumakonda. Cell: 9959770643 [K-1185570]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పసుపు.. పరుగు

మార్కెట్‌లో పంట ధరకు రెక్కలు

- క్వింటాల్‌కు రూ.12వేల పైనే..
- దాచుకున్న వారికే 'పచ్చ' బంగారం
- ఆనందంలో అన్నదాతలు

పచ్చ బంగారం పసుపు ధర పరుగులు పెడుతోంది. నెలరోజుల నుంచి వ్యవసాయ మార్కెట్‌లలో జెట్ స్పీడ్‌తో దూసుకెళ్తోంది. రికార్డు స్థాయిలో క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.12వేలకు పైగా పలుకుతోంది. దీంతో ఇన్నిరోజులు దాచుకుని నిరీక్షిస్తున్న రైతులకు బంగారంగా మారడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కేసముద్రం మార్కెట్‌లో పసుపు రాశులు

కేసముద్రం : కొన్నేళ్లుగా మార్కెట్‌లో పసుపుకు సరైన ధర లేక రైతులు నిరాశ చెందుతూ వచ్చారు. ఓ పక్క సరైన ధర, దిగుబడి లేక.. మరోవైపు పెట్టుబడులు లేక.. పసుపు రైతులు ఇతర పంటల సాగుపై దృష్టిసారించారు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా పసుపు సాగు విస్తీర్ణం అమాంతం పడిపోయింది. మార్కెట్‌లో పసుపు సీజన్ చివరి దశలో ధర ఒక్కసారిగా పెరుగుతూ క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.12వేలకు పైగా పలుకుతోంది. దీంతో ఇన్నిరోజులు దాచుకుని నిరీక్షిస్తున్న రైతులకు బంగారంగా మారింది. ఇదిలా ఉండగా ఇప్పటికే 95 శాతం మంది రైతులు ఎప్పటిలాగే ధర పెరగదనే ఉద్దేశంతో మార్కెట్‌లో తక్కువ ధర రూ.5 నుంచి రూ.6వేల వరకు అమ్ముకుని నష్టపోయారు. మిగతా రైతులు గిట్టుబాటు ధర కోసం ఎదురుచూస్తూ పసుపును దాచుకున్నారు. మరికొందరు రైతులు ధర కోసం ఏకంగా నాలుగేళ్లకు పైగా పసుపు శీతలగోదాంలో, ఇళ్లల్లో భద్రపరుచుకున్నారు. ఈ క్రమంలో నెలరోజులుగా వ్యవసాయ మార్కెట్‌లలో పసుపు ధరలకు రెక్కలొస్తున్నాయి. ఈ మేరకు కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం క్వింటాల్ పసుపు కాడిరకానికి గరిష్ట ధర రూ.12 వేలు దాటింది. ఇక్కడి మార్కెట్‌లో ఈ యేడాది మార్చి నుంచి పసుపు సీజన్ ప్రారంభం కాగా, మొదట్లో క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.5 నుంచి రూ.6వేల వరకు పలికింది. ఈ క్రమంలో నెలరోజుల క్రితం ఈ మార్కెట్‌లో క్వింటాకు గరిష్ట ధర రూ.10 వేలకు చేరింది. ఆ తర్వాత రోజురోజుకూ ధర పెరుగుతూ గరిష్ట ధర రూ.12వేలకు పైగా పలుకుతోంది.

పసుపుకు బదులు ఇతర పంటలు..

మరోవైపు.. ఇక ధర పెరగదనే ఉద్దేశంతో పలువురు రైతులు తక్కువ ధరకు అమ్ముకోవడంతోపాటు పసుపు పంటకు బదులు ఇతర పంటలను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో పసుపు ధర పరుగులు పెడుతుండడంతో వారు అయోమయానికి గురవుతున్నారు. కాగా పసుపు సాగులో రాష్ట్రంలోనే కేసముద్రం మండలానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. 2015 వరకు కేసముద్రంలో 6 వేల ఎకరాలకు పైగా పసుపు సాగు విస్తీర్ణం ఉండగా, ఆ తర్వాత పసుపుకు ధరలేక, మరోవైపు దిగుబడులు రాకపోవడంతో క్రమక్రమంగా పంట విస్తీర్ణం తగ్గుతూ వచ్చింది. ఈ మేరకు ఈ వానాకాలం కేవలం 150 ఎకరాల్లో మాత్రమే పసుపు పంట సాగు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇక మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా 1000 ఎకరాల వరకు పసుపు సాగు చేయనున్నట్లు అధికారులు అంచనా వేశారు. ఇదే రీతిలో రాష్ట్ర వ్యాప్తంగా పసుపు సాగు చేసే ప్రాంతాల్లో విస్తీర్ణం అమాంతం తగ్గిపోయింది.

కేసముద్రం మార్కెట్‌కు వచ్చిన పసుపు, ధర వివరాలు

సంవత్సరం	క్వింటాళ్లు	గరిష్ట ధర	కనిష్ట ధర
1)2018-19	85,378	రూ.7,713	రూ.4,000
2)2019-20	1,22,931	రూ.6,659	రూ.3,109
3)2020-21	9,7083	రూ.8,081	రూ.3,011
4)2021-22	62,646	రూ.7,811	రూ.2,952
5)2022-23	54,845	రూ.11,352	రూ.7,801

క్వింటాల్ పసుపు రూ.5,500కే అమ్ముకున్నా..



గతంలో 2 ఎకరాల్లో పసుపు పంట సాగు చేసేది. కానీ ధర లేకపోవడంతో ఈ యేడాది ఎకరం భూమిలో సాగు వేశా. పంటకు తెగుళ్ల సోకడంతో కేవలం 2.60 క్వింటాళ్లు మాత్రమే చేతికి వచ్చింది. మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.5,500కే ఖరీదు చేశారు. ఎలాగు ధర పెరగదనే ఉద్దేశంతో తక్కువ రేటుకే అమ్ముకున్నా. ఎలాగు పసుపు రేటు పెరగదని విత్తనం పసుపు కూడా అమ్మిన. ఈసారి అరెకరంలోనే సాగు చేస్తున్నా. ఇప్పుడు మార్కెట్‌లో పసుపుకు ఒక్కసారిగా ధర పెరుగుతాంది. పంట వేద్దామంటే అదునుదాటింది.

–సామ ప్రభాకర్, రైతు, అమీనాపురం

దాచుకోవడమే కలిసొచ్చింది



కొన్నేళ్లుగా పసుపు పంట సాగు చేస్తున్నా. కానీ మార్కెట్‌లో ధర పెరగకపోవడంతో నిరాశ చెందా. 3 ఎకరాల్లో పసుపు సాగు చేస్తే 50 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. అలా రెండేళ్లపాటు పండిస్తే, చేతికివచ్చిన 100 క్వింటాళ్ల పసుపును ఇంట్లోనే దాచిపెట్టా. మార్కెట్‌లో ధర లేకపోవడంతో దాదాపు నాలుగేళ్ల పాటు అలాగే ఉంచా. అలా దాచుకోవడమే నాకు కలిసొచ్చింది. ఒక్కసారిగా పసుపు ధర రూ.12వేలు దాటడంతో సంతోషం కలిగించింది.

–కాటం రాంరెడ్డి, రైతు కేసముద్రంవిలేజ్

క్వింటాల్ పసుపునకు రూ.12,213



ఈ ఏడాది ఎకరంన్నర భూమిలో పసుపు పంట సాగు చేశా. మొత్తం 30 కింటాళ్లకు పైగా చేతికివచ్చింది. గతేడాది క్వింటాల్ పసుపు రూ.6వేలకే అమ్ముకుని నష్టపోయినా. అందుకే ఈసారి అమ్ముకోవద్దనుకుని ఇంట్లోనే దాచుకున్నా. కొద్దిరోజులుగా పసుపు రేటు పెరుగుతాందని తెలిసి గురువారం 40 కింటాళ్ల పసుపును కేసముద్రం మార్కెట్‌కు తీసుకువచ్చా. నేను తెచ్చిన కాడిరకం పసుపుకు రూ.12,213 ధర పలికింది. ముందుజాగ్రత్తతో దాచుకోవడం వల్లే ధర కలిసొచ్చింది. ఇన్నేళ్ల తర్వాత ధర పెరగడం ఆనందంగా ఉంది.

–గుగులోతు శంకర్, రైతు, పీన్యాతండా, మదనతుర్తి, నెల్లికుదురు మండలం

దాతలు దయచూపరూ!

- నిట్‌లో సీటు సాధించిన నిరుపేద విద్యార్థి సన్నీ
- ఆర్థిక సాయం చేయాలని తల్లిదండ్రుల వేడుకోలు
- 10తేదీలోగా కాలేజీలో ప్రవేశానికి డెడ్‌లైన్

కన్నీటి గాథ



సన్నీ

చెన్నారావుపేట : కడుపేదరికం.. రెక్కాడితేకాని డొక్కాడని కుటుంబం.. కూలీకి వెళ్తేనే కూడు. లేనిపక్షంలో కుటుంబ మొత్తం ఆకలికి అలమటించుడే. ఇలాంటి పరిస్థితి ఉన్నా ఓ విద్యార్థి పట్టుదలతో చదివాడు. అనుకున్న లక్ష్యం చేరుకున్నాడు. అయితే ఉన్నత చదువుకు లక్ష్మీ కటాక్షం లేక ఓ నిరుపేద విద్యార్థి ఇబ్బందులు పడుతున్నాడు. ఎవరైన ఆర్థిక సాయం అందిస్తే ఉన్నతంగా చదువుకుంటానని పేర్కొంటున్నాడు. దాతల సాయం కోసం వేయికండ్లతో ఎదురుచూస్తున్నాడు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం బాపునగర్ గ్రామానికి చెందిన మంతెన ప్రభుదాస్, స్వప్న దంపతులకు ముగ్గురు కుమారులు. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం. వ్యవసాయ కూలి పనులకు వెళ్లి కుమారులను పోషించుకుంటున్నారు. పెద్ద కుమారుడు సన్నీ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి వరకు చదువుకున్నాడు. 5వ నుంచి 10వ తరగతి వరకు మరిపెడలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో చదువుకున్నాడు. ఇంటర్ ఎంపీసీ రాంపూర్‌లోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో చదువుకున్నాడు. బీటెక్ చదవడానికి ఎంసెట్ రాశాడు. అలాగే, జేఈఈ మెయిన్స్ రాయడంతో పశ్చిమ బెంగాల్‌లోని దుర్గాపూర్ నిట్ కళాశాలలో ప్రవేశం వచ్చినట్లు మెయిల్‌ద్వారా సమాచారం పంపించారు. దీంతో తనను ఎలాగైనా చదివించాలని తల్లిదండ్రులను ఒప్పించాడు. అప్పుతెచ్చి రూ. 20 వేలు ప్రవేశం కోసం ఆన్‌లైన్ ఫీజు చెల్లించారు. కళాశాలలో చేరగానే మరో రూ. 36 వేలు చెల్లించాలని తెలిపినట్లు చెప్పారు. అంతేకాకుండా సుమారు రూ. లక్షకు పైగా ఖర్చు అవుతుందని, చేతిలో డబ్బు లేక చదువు ఆపేయాల్సి వస్తుందని విద్యార్థి సన్నీ మనోవేదన చెందుతున్నాడు. పట్టుదలతో చదవగా సీటు వచ్చినా లక్ష్మీకటాక్షం లేకపోవడంతో కుమారుడి పరిస్థితి చూసి తల్లిదండ్రులు ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. ఈనెల 10 తేదీ వరకు కళాశాలలో చేరాలని సమాచారం అందించడంతో వారికి వేదన ఎక్కువైంది. దీనిపై దాతలు స్పందించి ఆర్థిక సాయం అందించాలని సన్నీతోపాటు తల్లిదండ్రులు వేడుకుకుంటున్నారు.

దాతలు 9052001950 ప్రభుదాస్, చెన్నారావుపేట ఎస్‌బీఐ అకౌంట్ నంబర్ 62202764705, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్ 0021352కి సాయం అందించాలని కోరారు.

ద్విచక్రవాహనాల దొంగ అరెస్ట్

- 8 బైక్‌లు స్వాధీనం
- నిందితుడు మైనర్



స్వాధీనం చేసుకున్న బైక్‌లను చూపుతున్న ఏసీపీ

కమలాపూర్: ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడుతున్న కమలాపూర్ మండలం గూడూరుకు చెందిన ఓ దొంగ (15)ను అరెస్ట్ చేసి నిందితుడి వద్ద నుంచి ఎనిమిది బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు కాజీపేట ఏసీపీ పి.డేవిడ్‌రాజ్ తెలిపారు. కమలాపూర్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కమలాపూర్ మండలం గూడూరు క్రాస్ రోడ్డులో గురువారం ఇన్‌స్పెక్టర్ సంజీవ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టగా గూడూరుకు చెందిన ఓ బాలుడు (15) అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించాడు. అనుమానం వచ్చిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడినట్లు అంగీకరించాడని తెలిపారు. నిందితుడి వద్ద నుంచి నాలుగు టీవీఎస్ ఎక్సెల్, ఒక గ్లామర్, ఒక స్ప్లెండర్ ప్లస్, ఒక హీరోహోండా, ఒక సీడీ డాన్, తదితర ఎనిమిది ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని బాల నేరస్తుడిని జువైనల్ కోర్టులో హాజరు పర్చి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. కాగా, ద్విచక్రవాహనాల చోరీ కేసును చేధించడంలో ప్రతిభ కనబర్చిన ఎస్సైలు చరణ్, సతీష్, సిబ్బంది సురేందర్, ప్రసన్నకుమార్‌ను ఏసీపీ అభినందించడంతో పాటు రివార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ సంజీవ్, ఎస్సై సీమా ఫర్వీన్, సిబ్బంది పాల్గొన్నారు.

బతకలేక.. బలవన్మరణం

వివిధ కారణాలతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ముగ్గురు బలవన్మరణానికి పాల్పడ్డారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం పెద్దంపల్లిలో ఒకరు, గార్ల మండలం పుల్లూరు గ్రామంలో మరొకరు, నర్సింహులపేట మండలం బుడ్డతండాలో ఇంకొకరు తనువు చాలించారు. దీంతో ఆయా కుటుంబాలు దుఃఖ సాగరంలో మునిగాయి.

జీవితంపై విరక్తి చెంది ఒకరి ఆత్మహత్య

టేకుమట్ల(రేగొండ): జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి.. పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం పెద్దంపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన కోడెపాక రాజేశం(52) మద్యానికి బానిసై ఇంట్లో గొడవ చేస్తుండడంతో పాటు డబ్బు కావాలని కుటుంబీకులను వేధిస్తున్నాడు. ఈ నెల 1వ తేదీన కూడా మద్యానికి డబ్బు కావాలని వేధించగా వారు నిరాకరించారు. దీంతో అదే రోజు ఇంటి నుంచి బయటకు వచ్చిన రాజేశం మండల కేంద్రంలో బత్తుల వెంకటేశ్వర్లుకు చెందిన వ్యవసాయ భూమిలో పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం మృతదేహాన్ని గుర్తించిన రైతు.. పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని రాజేశంగా గుర్తించారు. దీనిపై మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ద్యార్యాప్తు చేస్తున్నట్లు రెండో ట్రైనీ ఎస్సై తీగల మాధవ్‌గౌడ్ తెలిపారు.

పుల్లూరు గ్రామంలో మరొకరు..



రాము (ఫైల్)

గార్ల: జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి.. పురుగుమందు సేవించి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన గార్ల మండలం పుల్లూరు గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన భూక్యా రాము(35) మద్యం కోసం డబ్బు ఇమ్మని తరచూ భార్యను వేధిస్తున్నాడు. బుధవారం కూడా వేధించడంతో ఆమె అదే గ్రామంలోని పుట్టింటికి వెళ్లింది. దీంతో జీవితంపై విరక్తి చెందిన రాము పురుగుల మందు సేవించి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని గార్ల సీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై కె వీరారెడ్డి తెలిపారు.

బుడ్డతండాలో కుటుంబ కలహాలతో ఇంకొకరు..

నర్సింహులపేట: కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి.. ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని పెద్దనాగారం పరిధిలోని అజ్మీరాతండా శివారు బుడ్డతండాలో జరిగింది. తండాకు చెందిన బానోతు మోహన్(30) ఇంట్లో కొంతకాలంగా కుటుంబ కలహాలు జరుగుతున్నారు. దీంతో మనస్తాపం చెందిన ఆయన గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై మృతుడి తల్లి కౌసల్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీష్ తెలిపారు.

కష్టపడితే అత్యుత్తమ ఫలితాలు

- ఎస్సార్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ఎ.వరదారెడ్డి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎ. వరదారెడ్డి

హసన్‌పర్తి: కష్టపడితే అత్యుత్తమ ఫలితాలు సాధించొచ్చని ఎస్సార్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ఎ.వరదారెడ్డి అన్నారు. ఎస్సార్ యూనివర్సిటీ బి.టెక్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందిన విద్యార్థులకు గువారం ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సమావేశానికి వరదారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ప్రయోజనాల కోసం భారతదేశ ప్రతిభను అభివృద్ధి చేయడానికి సార్వత్రిక నాణ్యమైన విద్య ఉత్తమ మార్గమన్నారు. సాంకేతిక సంబంధిత సామాజిక స్పృహ కలిగిన భావితరాన్ని తయారు చేసేందుకు ఎస్సార్ యూనివర్సిటీ కృషి చేస్తోందన్నారు. యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్ మాట్లాడుతూ మార్పులకనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు రోజూ ఒక కొత్త విషయం నేర్చుకోవాలని సూచించారు. రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి మాట్లాడుతూ 21వ శతాబ్దపు ప్రపంచీకరణ ప్రపంచంలో సరిపోయ్యేలా పాఠ్య ప్రణాళిక మార్పులను తీసుకొచ్చినట్లు వివరించారు. దీని అమలు వల్ల విద్యార్థులను అధిక వేతన ప్యాకేజీలతో మంచి కంపెనీల్లో పనిచేయడానికి వీలు కలుగుతుందన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధ్యాపకులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి

- ఇస్రో మాజీ సీనియర్ సైంటిస్ట్ కంజిలాల్



మాట్లాడుతున్న కంజిలాల్

హన్మకొండ అర్బన్: విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని ఇస్రో మాజీ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ అపూర్వ కంజిలాల్ అన్నారు. గురువారం నగరంలోని పింగిళి ప్రభుత్వ మహిళ కళాశాలలో ప్రిన్సిపాల్ చంద్రమౌళి అధ్యక్షతన కళాశాల భౌతిక శాస్త్ర విభాగం, ఐక్యూఎస్సీ ఆధ్వర్యంలో 'చంద్రుడిపై భారతదేశ యాత్ర చంద్రయాన్' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు కంజిలాల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం అన్ని సబ్జెక్టుల విద్యార్థులకు అవసరమన్నారు. పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే విద్యార్థులకు సైన్స్‌పై కనీస అవగాహన ఉండాలన్నారు. జూలై 14 శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం నుంచి ప్రయోగించిన చంద్రయాన్ –3 ఆగస్టు 23న రోవర్ చంద్రుడిపై ల్యాండ్ అవకాశం ఉందని తెలిపారు. చంద్రయాన్ –3 ముఖ్య లక్ష్యాలు చంద్రుడి కూర్పు అర్థం చేసుకోవడం, చంద్రుడి ఉపరితలంపై లభ్యమయ్యే రసాయనాలు, సహజ మూలకాలు, నేల, నీరు తదితర అంశాలపై అక్కడే శాస్త్రీయ ప్రయోగాలు, పరిశీలనలు చేయడమన్నారు. ఈ సందర్భంగా భారతదేశ అంతరిక్ష తొలి ప్రస్థానం నుంచి నేటి వరకు జరిగిన పరిణామాల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.సుహాసిని, పరీక్షల నియంత్రణాధికారి డి.రామకృష్ణారెడ్డి, అకడామిక్ కోఆర్డినేటర్ డి.పార్వతి, భౌతిక శాస్త్ర విభాగాధిపతి సీహెచ్ స్నేహలతారెడ్డి, విభాగ అధ్యాపకురాలు ఎస్.కిరణ్మయి, తదితరులు పాల్గొన్నారు.

అర్హత ఉన్న డ్రైవర్లను నియమించాలి

- డ్రైవర్, క్లీనర్ అసోసియేషన్ ప్రతినిధి బండి భాస్కర్

ఖిలా వరంగల్: హెవీ లైసెన్స్, 3 ఏళ్ల అనుభవం ఉన్న అర్హులైన డ్రైవర్లనే ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు నియమించుకోవాలని ప్రైవేట్ విద్యా సంస్థల బస్సుల డ్రైవర్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి బండి భాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీఏ నిబంధనలను యాజమాన్యాలు, అధికారులు వదిలేయడం దురదృష్టకరమన్నారు. అర్హతలేని డ్రైవర్ల నియామకం వల్లే ప్రమాదాల జరుగుతున్నాయని, శిక్షణ తరగతులను నిర్వహించడంలో ఆర్టీఏ అధికారులు విఫలమయ్యారని చెప్పారు. ప్రైవేట్ విద్యా సంస్థల బస్సుల ఓనర్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గాదె స్వరూప్ రెడ్డి ఆధ్వర్యంలో డీటీసీ, ఎంవీఐ స్థాయి అధికారుల నేతృత్వంలో 2019 విద్యా సంవత్సరం వరకు డ్రైవర్లు, క్లీనర్లకు తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్, గణపతి ఇంజనీరింగ్, వాగ్దేవి ఇంజనీరింగ్, జేఎస్ఎం స్కూల్ ప్రాంగణాల్లో శిక్షణ తరగతులు నిర్వహించారని గుర్తు చేశారు. శిక్షణ తరగతులతో డ్రైవర్లల్లో అవగాహన పెరిగి ప్రమాదాల సంఖ్య పూర్తిగా తగ్గిందని తెలిపారు. వేతనం ఎక్కువగా ఇవ్వాల్సి వస్తోందని సీనియర్ బస్సు డ్రైవర్లను పక్కన పెట్టి స్కూల్ యాజమాన్యాలు అవమానిస్తున్నాయన్నారు. అనుభవం లేని డ్రైవర్ల నియామకం , ఆర్టీఏకు ముందు చూపులేక ప్రమాదాలు పెరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా ఆర్టీఏ అధికారులు స్పందించి డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో టీచర్ మృతి



వెంకట్రాంనర్సయ్య (ఫైల్)

గూడూరు: మండలంలోని మర్రిమిట్ట శివారు రాళ్లవాగు సమీపంలోని ఎన్‌హెచ్‌పై ఓ ఎద్దుల బండిని ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ఘటనలో ప్రభుత్వ తెలుగు పండిట్ అక్కడిక్కడే మృతి చెందాడు. మండల కేంద్రంలోని చెంద్రుగూడేనికి చెందిన మంతెన వెంకట్రాంనర్సయ్య (50) మచ్చర్ల ప్రాథమిక పాఠశాలలో తెలుగు పండిట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. పని నిమిత్తం బైక్‌పై గురువారం ఉదయం నర్సంపేటకు వెళ్లి తిరిగి గూడూరుకు వస్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా ఆగి ఉన్న ఎద్దుల బండిని ఢీకొన్నాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, బాల్య మిత్రులు, బంధువులు బోరున విలపిస్తూ ఘటనా స్థలికి చేరుకున్నారు. వెంకట్రాంనర్సయ్య మృతితో చెంద్రుగూడెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా, మృతుడికి భార్య స్వరూప, కూతురు, కుమారుడు ఉన్నారు.